## క్లుప్తంగా

### ఘనంగా అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్య స్వామి

**కార్వేటినగరం:** స్కందపుష్కరిణి సమీపంలో వెలసిన వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యం స్వామి ఆలయంలో అభిషేక పూజలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వళ్లీ, దేవసేన, సమేత శ్రీసుబ్రమణ్యస్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ప్రదోష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

### కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కరాటే బెల్టు అందిస్తున్న ఎస్ఐ రాజాకుళ్లాయప్ప

**నగరి :** జపాన్ షిటోరాయ్ కరాటే శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం బెల్టులను ప్రదానం చేశారు. స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరి ఎస్ఐ రాజాకుళ్లాయప్ప ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అన్నాదొరై, రాజ్‌కోటి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించండి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

**పుత్తూరు:** ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు మంగళవారం డిపో మేనేజర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తులసిరామ్ మాట్లాడుతూ సర్క్యులర్ మేరకు జీతాలు చెల్లించాలని కోరారు. ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి విడుదలయ్యే కాంట్రాక్టు కార్మికుల డీఏ పెంపు నోటిఫికేషన్స్ నోటీసు బోర్డులో పెట్టాలని, పీఎఫ్, ఈఎస్ఐ మినహాయింపును కార్మికులకు తెలియజేయాలని, జీతంతో కూడిన 9 రోజుల సెలవును ప్రకటించాలన్నారు. ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

### వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పిస్తున్న డా.స్వాతి

**గంగాధర నెల్లూరు:** పసిపిల్లలకు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డా.స్వాతి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని వేల్కూరు, ముక్కళత్తూరు గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో జరుగుతున్న ఐఎంఐ( ఇంటెసిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు) కార్యక్రమాన్ని సీహెచ్ఓ శ్రీనివాసులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 0–2 ఏళ్లలోపు పసిపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. తద్వారా పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందని, అలాగే పిల్లల ఎదుగుదల బాగుంటుందని, వ్యాధుల బారిన పడరని, గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

### అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె

**నగరి/పుత్తూరు:** రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా నగరి, పుత్తూరు పట్టణాల్లో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట బైటాయించిన వారు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. నగరిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి, మినీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలని సీడీపీఓలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# నేతన్నలకు అండగా ప్రభుత్వం

- హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే
- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలో గుర్తించడానికే గడప గడపకు వెళ్తున్నాం
- మంత్రి ఆర్‌కే రోజా



మరమగ్గాల ద్వారా వస్త్ర ఉత్పత్తిని పరిశీలిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

**నగరి :** ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపేట కామరాజనగర్, చిదంబరనగర్ ప్రాంతాల్లో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు మంత్రి రోజాకు దుశ్శాలువలు వేసి హారతులు పట్టి స్వాగతించారు. స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ప్రతి గడపకు వెళ్లిన ఆమె నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని నివాసితులకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గతంలో బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన టీడీపీ ప్రభుత్వం ఎన్ని హామీలు నెరవేర్చిందో ఒక్కసారి పరిశీలిస్తే ఎవరెంత మేలుచేశారో కళ్లకు కట్టినట్లు అర్థమవుతుందన్నారు. తమ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గతంలో లాగే మళ్లీ ప్రజలను ఏమార్చడానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రయత్నిస్తారని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. పార్టీ గెలిచిన రోజు నుంచి ఈ నాటి వరకు ప్రజల మధ్యే తిరుగున్నామని, గతంలో ఎవరైనా ఇలా మీ మధ్యకు ఎప్పుడైనా వచ్చారా అని ప్రజలను ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించుకుని, మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు.

**మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత..**

ఈ ప్రాంతంలోని మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి రోజా తెలిపారు. వీవర్స్ పెన్షన్ల ద్వారా ఎంతోమందికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. తాము చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమం రికార్డు పూర్వకంగా చెప్పగలమన్నారు. ప్రతి గడపలో లభించే ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లోను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు మోహన్‌రాజ్, భూపాలన్, బాబు, నాయకులు సతీష్, ఇళంగో, రమేష్, మున్సిపల్ డీఈ నరేష్, ఏఈ రమేష్, మెప్మా టీఎల్ఎం సునీత, హౌసింగ్ ఏఈ భాస్కర్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**నేతన్నలకు తోడుగా ఉంటా..**

గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆర్కేరోజా మరమగ్గాల ద్వారా జరిగే వస్త్ర ఉత్పత్తిని పరిశీలించారు. నేత నేస్తున్న వస్త్రాలు ఏ రకానికి చెందినవి ? ఆర్డర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత సామాజిక వర్గానికి చెందిన కోడలిగా తాను నేతన్నలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వ యూనిఫాం ఆర్డర్లు ఇచ్చి వారికి పని కల్పించడం జరిగిందన్నారు. అత్యాధునిక యంత్రాలను ట్రయల్ రన్ తెప్పించి శిక్షణ అందించామని తెలిపారు. చీరల ఉత్పత్తిపై కూడా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించినట్లు చెప్పారు.

## తపాలా శాఖ సిబ్బంది నిరవధిక సమ్మె



పుత్తూరులో ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

**పుత్తూరు:** సమస్యల పరిష్కారం కోరుతూ తపాలా శాఖ ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మెకు దిగారు. స్థానిక ఎన్జీఓ కాలనీలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉద్యోగులు విధులను బహిష్కరించి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పుత్తూరు సబ్ డివిజన్ కార్యదర్శి కె.నాగయ్య మాట్లాడుతూ అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) పిలుపు మేరకు దేశవ్యాప్త నిరవధిక సమ్మెను ప్రారంభించినట్లు తెలిపారు. 7వ వేతన కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఉద్యోగులకు మొండిచేయి చూపిందని ఆరోపించారు. పలు దఫాలుగా ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో నిరవధిక సమ్మెకు దిగినట్లు వివరించారు. సివిల్ సర్వెంట్ హోదా, అదనపు సర్వీసు ఇంక్రిమెంట్లు, 180 రోజులకు ఎర్న్‌లీవ్, కమలేష్ కమిటీ సిఫార్సుల్లో ఇప్పటి వరకు అమలు చేయని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళావెంకట్రావ్, మురళికుమార్‌యాదవ్, మునికుమార్, రుషేంద్ర, జాన్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ ఇంద్రధనస్సును విజయవంతం చేయండి

- ఇమ్యూనైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ రవిరాజు



మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రవిరాజు

**పాలసముద్రం:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం పాలసముంద్రం, వెంగళరాజకుప్పం, శ్రీకావేరిరాజపురం గ్రామాల్లో జరుగుతున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి గర్భిణులు, బాలింతల వివరాలను విధిగా సేకరించి వారికి కావాల్సిన వైద్య సౌకర్యాలను అందించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన గ్రామాలు ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## 16న మండల మీట్

**వెదురుకుప్పం:** మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మీటింగ్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

## కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారం



నగరిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**నగరి :** మండలంలోని వీకేఆర్ పురం గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార నిమిత్తం విచ్చేసిన వ్యాన్‌లో సిబ్బంది ప్రభుత్వ పథకాలకు దిగువ, మధ్యతరగతి జనాభాను గుర్తించి వారు కేంద్ర పథకాల ప్రయోజనాలకు అర్హత పొందుతారా అనే అంశంపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఏఓ రాఘవేంద్రయాదవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మందుల పిచికారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

**గంగాధర నెల్లూరు:** పురుగుమందుల పిచికారీ సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఓ వందన అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపల్లిలో మంగళవారం ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి ఏఓ పురుగు మందుల వాడకంపై రైతులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. పురుగు మందుల పిచికారీ సమయంలో రక్షణ దుస్తులు, మాస్కులు ధరించాలన్నారు. స్ప్రేయర్ నాజిల్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదరాదని, వాడిన తరువాత పురుగుమందుల డబ్బాలను మట్టిలో పూడ్చిపెట్టాలని సూచించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించండి



వలంటీర్లకు కిట్లను పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి

**పెనుమూరు(కార్వేటినగరం):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తాటిమాకులపల్లి సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ బాలాజీ, ఎంపీటీసీ శివలింగం ఆధ్వర్యంలో ప్రారంభించారు. అలాగే సచివాలయ ఆవరణలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అదేవిధంగా నాయకులు అత్తిమాకులపల్లిలో పార్టీ పతాకాన్ని ఎగుర వేసి ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం క్యాలెండర్ వారీగా సంక్షేమ పథకాలను అందించిన సీఎం జగనన్నను 2024 ఎన్నికల్లో ఆదరించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ దొరస్వామి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, యువత అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాము, బీసీ సెల్ అధ్యక్షుడు నీలా పండరీనాథ్, నాయకులు కృష్ణారెడ్డి, రాజారెడ్డి, లక్ష్మీపతి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**జీడీనెల్లూరులో..**

**గంగాధర నెల్లూరు:** మండలంలోని వరత్తూరు గ్రామ సచివాలయంలో మంగళ వారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ లక్ష్మి, ఉప సర్పంచ్ దొరైరాజ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అయ్యప్ప రెడ్డి వరత్తూరు గ్రామ సచివాలయంలో మండల నాయకులు, అధికారులతో కలిసి సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలిసే డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న నాయకులు

## చందన అలంకరణలో బంగారమ్మ



భక్తులను అనుగ్రహిస్తున్న బంగారమ్మ అమ్మవారు

**కార్వేటినగరం:** మేజర్ పంచాయతీ కార్వేటినగరం గ్రామ ప్రజల కొంగు బంగారంగా కొలువుదీరిన శ్రీబంగారమ్మ మంగళవారం చందన అలంకరణతో భక్తులకు అభయమిచ్చారు. నగరం గంగజాతరను పురస్కరించుకుని అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనే, నారికేళి జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. 19, 20 తేదీల్లో జరిగే గంగమ్మజాతరను పురస్కరించుకుని మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు వండి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**నేటి నుంచి నగరంలో జాతర వేడుకలు**

గంగమ్మజాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి జాతర చాటింపు ఉంటుందని ఆలయ అధ్యక్షుడు కే.ప్రసాద్ తెలిపారు. బుధవారం నుంచి గంగజాతర వేషకాలతో జాతర సంబరాలు ప్రారంభం అవుతాయన్నారు. ఆదివారం సాయంత్రం శ్రీ బంగారమ్మ అమ్మవారి ఆభరణాలతో పాటు, అమ్మవారి బంగారు విగ్రహాన్ని రజకులకు స్వాధీనం చేసి సంస్థానాధీశులు ఆనవాయితీ ప్రకారం ఆనాటి నుంచి అమ్మవారు గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారని తెలిపారు. జాతరను ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, భక్తులు పలువురు పాల్గొన్నారు.

## 'ఆడుదాం ఆంధ్ర' ఏర్పాట్లపై సమీక్ష



మైదానాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి



మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎంఈఓ, డీఈ

**గంగాధర నెల్లూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై సచివాలయ సిబ్బందికి, వ్యాయామ ఉపాధ్యాయులకు, అధికారులకు మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కార్యక్రమ ప్రత్యేకాధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో రిజిస్టర్ చేసుకున్న వారి జాబితా సిద్ధం చేసుకోవాలని, క్రీడల నిర్వహణ ప్రభుత్వం సూచించిన, ఉన్నతాధికారులు ఇచ్చిన నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. అందరినీ సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించి, క్రీడలు నిర్వహించడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

**పెనుమూరులో..**

**పెనుమూరు(కార్వేటినగరం):** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఆడుదాం.. ఆంధ్ర క్రీడలకు కేటాయించిన మైదానాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని క్రీడలపై ఆసక్తి కలిగిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఎంఈఓ రంగనాథరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి ఆవుల సంరక్షణపై శ్రద్ధ పెట్టండి



మందులు అందజేస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

**వెదురుకుప్పం:** పాడి ఆవుల సంరక్షణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి వెంకట గాయత్రి సేవాట్రస్ట్ వ్యవస్థాపకులు శేషగిరిరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం పాడి పెంపకంపైనే ప్రజలు జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. పాడి రైతుల శ్రేయస్సు కోసం తమ ట్రస్టు తరపున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. పాడి ఆవుల్లో వచ్చే సీజనల్ వ్యాధులకు సంబంధించి వాటి నివారణ చర్యల్లో భాగంగా ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా పాడి ఆవుల్లో పొదుగు వాపు, సీజనల్ వ్యాధులు, జీర్ణసంబంధిత వ్యాధులు సంక్రమిస్తున్నట్లు తెలిపారు. వీటి నివారణకు మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు రామయ్య మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులకు అండగా వెంకట గాయత్రి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దాతల సేవలను సద్వినియోగం చేసుకుని పాడి అభివృద్ధికి పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ రూపసుందరి, ప్రతినిధులు హనుమంతరావు, దాక్షాయణి, విశ్వనాథ్, సుబ్బారావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎందుకు అలసత్వం వహిస్తున్నారు ?



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్

**వెదురుకుప్పం:** లబ్ధిదారులకు తాము అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నా, నిర్మాణాల్లో అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న అగ్గిచేనుపల్లె జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. జగనన్న కాలనీల్లో పక్కా గృహాలు మంజూరై రెండేళ్లు అవుతున్నా నేటికీ పూర్తిస్థాయిలో పూర్తి చేయకపోవడంపై ఏంటని అసహనం వ్యక్తం చేశారు. మండలానికి మొత్తం 1,540 పక్కా గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 907 గృహాలు పూర్తి అయినట్లు చెప్పారు. 296 గృహాలు పునాది స్థాయిలో, రూఫ్‌లెవల్‌లో 86, స్లాబ్ లెవల్‌లో 220 గృహాలు నిర్మాణ దశల్లో ఉన్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న గృహాలను జనవరి 30 లోపు పూర్తి చేయాలన్నారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకపోతే ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను లబ్ధిదారుల నుంచి రికవరీ చేయనున్నట్లు హెచ్చరించారు. పక్కా గృహాలను రద్దు చేసి అర్హులైన వారికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పుష్ప, రంగారెడ్డి, హౌసింగ్ ఏఈ పృథ్వీ, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగం మన బాధ్యత



ఈవీఎం మిషన్ ద్వారా ఓటింగ్ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

**కార్వేటినగరం:** ఓటు హక్కును ప్రతిఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని ఆర్ఐ రెడ్డెప్ప అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ గతంలో ఏ గుర్తుకు ఓటు వేసినట్లు తమకు తెలియదని, ఇప్పుడు అధునాతన మిషన్ల ద్వారా ఓటు వేయడం వల్ల మనం ఏ గుర్తుకు ఓటు వేశామో వెంటనే డిస్‌ప్లే ద్వారా తెలుస్తుందని, అలాగే ప్రింట్ కూడా వస్తుందన్నారు. ఓటు విధానంలో ఎలాంటి అపోహలు వద్దని ప్రతిఒక్కరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం నెల రోజుల పాటు ప్రతి పంచాయతీలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోవింద స్వామి, వీఆర్‌ఓలు శంకర్, కృష్ణయ్య, చిరంజీవి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.